
# దీపావళి




అయిదు వేలు పెళ్ళి తంతు ఖర్చు.

ఇరవై తులాల బంగారం, పదివేల బట్టలూ సామానూతో అట్టహాసంగా— అందరూ 'ఓహో' అనేట్లుగా అత్తవారింటికి తరలివెళ్ళింది తలిదండ్రుల కంటి దీపమైన లక్ష్మి.

వేలాది ఆంధ్రయువతులకు ప్రతీక లక్ష్మి. అత్తయింట అణిగి మణిగి వుండాలనీ, పనిపాటలు చేస్తూ ఆ పరివారంలో ఒకతెగా కలిసిపోవాలనీ తెలిసిన ప్రాథమిక సూత్రాలతో పాటు, తనకున్న హైస్కూలు విద్యవల్ల అంతో యింతో

ఆధునిక విజ్ఞానం కూడా పొందివున్న లక్ష్మికి ఈ క్రొత్తయింటి విషయాలు ఆకళింపు అయ్యీ అవ్వకుండా వున్నవి

వరుడు-లక్ష్మిభర్త ఒక పెద్ద ఆఫీసులో జూనియర్ ఇంజనీరు, వివాహం కోసం నె ల రో జు లు సెలవుమీద వచ్చాడనీ అతడి తరుపువారు అన్నారు.

అయితే వివాహపు తంతులన్నీ ముగియడమూ, పెండ్లి సందడి తగ్గి మరో రెండు నెలలు గడవడమూ కూడా జరిగినా అతడు ఉద్యోగానికి ఎందుకు కదలి పోవడం లేదో లక్ష్మికి అంతుపట్టలేదు.

''మనం ఎప్పుడు వెళ్ళేదీ ?''

భర్త వద్ద బెరుకూ, క్రొత్తదనమూ పోయి కొంత చనవు ఏర్పడినట్లు భావించిన లక్ష్మి పై ప్రశ్న మూడుసార్లు అడిగిన తర్వాత పార్థసారధి సమాధానంగా ఒక్క మూలుగు మూల్గి ఏదో పనివున్న, ట్లుగా హడావుడిగా దుస్తులు వేసుకొని బయటకు వెళ్ళిపోయాడు.

రాను రాను లక్ష్మిలో అనుమానం ఏదో కలుగసాగింది.

నిజంగా ఉద్యోగస్తుడే అయితే, పెండ్లిలో మామ గారిచ్చిన మంచిదుస్తులు మినహా మరి దుస్తులే వుండవా? ''మార్కెట్‌కు పోయి రారా పార్థుడూ'' అని తల్లి లెఖ్ఖగా డబ్బు యిస్తుంది. తిరిగి వచ్చాక అతడు తన సిగరెట్ ఖర్చుతో సహా లెఖ్ఖలు చెప్తాడు అతడి కొఱకు స్నేహితులు వస్తారు- అందు ఒక్కడూ గణింపదగిన చదువూ వ్యాపారమూ వున్నవాడిలా కన్పట్టడు. వారితో పగలంతా ఎక్కడెక్కడో తిరిగి వస్తాడు.

''ఒరే పార్థూ, ఆ పని చెయ్యి ఈ పని చెయ్యి'' అంటూ తల్లీ తండ్రీ అప్ప చెల్లెళ్ళూ పుర్మాయిస్తారు నౌఖరుకు చెప్పి నట్లే, అప్పుడప్పుడు చిటచిటలూ విన వస్తాయి- అయితే లక్ష్మికి తెలియనీకండా రహస్యంగా!

ఏదో రహస్యం బయటపడిపోతుందే మోనన్నంత జాగ్రత్తగా తూచి తూచి మాట్లాడుతారు లక్ష్మితో ప్రతి ఒక్కరూ, కడకు భర్తకూడా! ఇరుగు పొరుగుల వారూ, బంధువులూ వస్తారు. అయితే లక్ష్మితో వారు ఎవరూ మాటలాడకుండా వేయి కనులు కాపలా వుంటాయి ఎప్పుడూ చుట్టూ.

లక్ష్మిలో అనుమానం-ఇతడు నిజంగా ఎక్కడో ఉద్యోగం చేస్తున్నాడా, మోసం జరిగిందా ?

మరో నెల గడిచింది.

లక్ష్మి అనుమానం బలపడింది.

నవ వధువు పాతబడింది.

రాను రాను ఆదరణ సన్నగిల్లుతూ న్నది.

పనిపాటల బరువూ, సాధింపులూ అధికమౌతున్నాయి.

ఆ సాధింపూ, దూషణా తన సమ క్షంలోనే జరిగినా పార్థసారధి నిమ్మకు నీరెత్తినట్లుంటాడు, అసమర్థుడివలె.

ఈ జడత్వం లక్ష్మిలో కల్లోలం లేవదీసింది.

ఇంట అందరూ తఱచూ సినిమాలు చూస్తారు. సాయంకాల విహారాలకు పోతారు. పెద్దకొడుకూ, కోడలూ ఆడపడుచులూ వారి వారి భర్తలూ జంట జంటలుగా పోతారు.

లక్ష్మి నొసట ఆ అదృష్టం లేదు. ఆమెను వెంటబెట్టుకు ఎక్కడికీ పోగల స్వతంత్రతగానీ శక్తిగానీ అతడికి లేనట్లుగా, తగ్గితగ్గి, అందరికీ ఒదిగిఒదిగి బ్రతుకుతాడు. ఇన్ని నెలల్లో ఆ నవ దంపతులు చూసిన సినిమాలు రెండంటే రెండే. ఆ రెండూ కూడా ఒంటరిగాకాదు_ పార్థసారధి తల్లి కనకమ్మ వెంటవుంది. ఆ భార్యాభర్తలు దేవాలయానికి వెళ్ళినా కనకమ్మ వెంటబడుతుంది పసిపిల్లలాగా, ఆ ఇద్దరికి ఏకాంతత అసంగత విషయం లాగా. ఫలితంగా లక్ష్మిసారధిల నడుమ ఉండవలసినంత చనువు ఉండటంలేదు.

'ఇతడు ఇంజనీరు కాదు ఏమీ కాదు. ఉద్యోగం లేకుంటే పోయె, కనీసం డిగ్రీ అయినా వున్నదా? ఉండివుంటే ఏ ఉద్యోగాలకూ దరఖాస్తులు పెట్టినట్టు కూడా కన్పించదేం?'

"ఔను. డిగ్రీ కూడాలేదు. నీ భర్తకు కనీసం కళాశాల చదువు కూడా లేదు," అని ధృవపరచింది హఠాత్తుగా ఒకనాడు ఎక్కడినుండో వూడిపడిన ఒక చుట్టం.

మనసులో అనుమానం నిజం కాకూడదనే ఆశతో బ్రతుకుతూన్న లక్ష్మిపట్ల ఈ నిర్ధారణ అశనిపాతమే అయ్యింది.

"నిన్ను వీళ్ళు బాగా మోసంచేశారే అమ్మాయ్. ఇక యిప్పుడు ఏమనుకొని ఏం లాభం? అయినా, అంతంతలేసి కట్నాలూ, కానుకలూ కురిపించినవాళ్ళు పిల్లాడిగురించి ముందస్తుగా కాస్త ఆరా తీసుకోనక్కర్లే?"

కృంగిపోయిన లక్ష్మి కొలదిరోజుల తర్వాత ధైర్యాన్ని పుంజుకున్నది.

"నేను విన్నది నిజమేనా?" ధైర్యంగా అడిగింది భర్తను.

సమాధానం ఒక చెంపపెట్టు!

లక్ష్మి దిమ్మెరబోయినా స్థైర్యం విడువ లేదు.

"నేను విన్నది నిజమేనా అక్కా?" పెద్ద తోడికోడలిని అడిగింది.

"యేమో బాబూ, నాకెందుకొచ్చిన గోల? అత్తనే అడగరాదూ ఆ అడిగేది?"

"అక్కా, నా బాధ చూచి నీకు జాలి లేదూ?"

"ఏం, ఏమొచ్చిందిప్పుడూ తిండికి కరవా, గుడ్డకు కరవా?" నిర్లక్ష్యంగా అనేసింది.

"హుఁ." మండిపోయింది లక్ష్మి మనసు. "అవును. నేనేమైనా నీ కూతురినా? నాగురించి నీకేం నొప్పి! మీ కందరికీ జీతం భత్యం లేని దాసిగా దొరికాను మరి........ చదువూ సంధ్యా

ఉద్యోగం సద్యోగం లేనివాడిగురించి అన్ని అబద్ధాలు చెప్పి ఎందుకిలా ముడి వేశారు ?"

"నన్నెందుకు నిలదీస్తావ్ మధ్యన ? పెద్దవాళ్ళనడుగు." కోపం కురిపించింది స్వరంలో.

"పెళ్ళిచూపులకు వచ్చిన ముఠాలో నువ్వూ వున్నావ్ గనుక !"

తిరస్కారంగా అన్నదామె. "నీ నాన్న నిర్వాకం అలా ఏడిసిందనుకో. అవతలివాళ్ళు చెప్పేవన్నీ నిజమౌనా కాదా అని ఆరా తీసుకోగల జ్ఞానం అతగాడికి వుండొద్దూ ?"

"ఇటువంటి సిగ్గుమాలిన అన్యాయాలు చూసీ-చేసీ వుండలేదు మరి ఆయన !"

అంతలో అటునుండి అత్త ఇటు నుంచి ఆడపడుచులూ రంయ్యిన దూసుకు వచ్చారు.

"ఏమిటి మహా వగర్చుతున్నావ్ ? ఎంత ఏడ్చినా ఇక కట్టిన తాడును త్రెంపి పోలేవు కదా ? ఏం నా కొడుక్కేం తక్కువట ? గుణమా ? రూపమా ?"

"అబ్బో.... ఇంతకంటె కొమ్ములు తిరిగినవాళ్ళనే చూచాం కానీ అట్టే మిడిసి పడకమ్మా తల్లీ."

ఆడపడుచులు హెచ్చరించారు.

నివ్వెరపాటుతో నిస్త్రాణతో చూస్తూ నిలబడిపోవటంకంటె లక్ష్మి ఏమన గలదు !

## 2

"ఏదీ నీ గొలుసిలా యియ్యి. కొంచం డబ్బు అవసరంగా వున్నది."

పార్థసారధిని చిత్రంగా చూచింది లక్ష్మి.

"మీకేం పని ? మీ కెందుకు డబ్బు ?"

"అడ్డు సవాళ్ళు మాని నోరుమూసుకు యియ్యి."

అప్పటికి గ్రహించింది లక్ష్మి అతడు బాగా త్రాగివున్నాడని. భండారం బయట పడిన తర్వాత స్వేచ్ఛ వచ్చినట్లుగా ప్రవర్తిస్తున్నాడు

"ఏమిటి ఆలోచన ?" ఉరిమాడు.


"నేనివ్వను."

"భార్యకు ఓ పదిపైసల పువ్వులైనా కొనివ్వలేని తాహతుకు వేల ఖరీదుచేసే గొలుసెందుకు ?"

అతడి కోపం హద్దులు దాటింది. ఫలితంగా దెబ్బలు. బలవంతంగా తీసుకు పోయాడు గొలుసు. వారంరోజులవరకూ అయిపులేదు. 'ఇదన్నమాట అతగాడి అసలు స్వరూపం !'

"ఇదేం గోలోనమ్మా. మొగుడి మాటకు ఎదురు చెప్పటం - తన్నించు కోవటం - ఇరుగూ పొరుగులు నవ్వటం మా యింటా వంటా లేదు. ఛీ."

తప్పంతా లక్ష్మిదేనన్నట్లుగా అత్త మందలింపులూ, ఛీత్కార బాణాలూ విసురుతూంటే, మిగిలిన బలగం ముసి




ముసి నవ్వులతో సంతోషించుతూంటే లక్ష్మి నివ్వెరపోయింది.

ఇందరాడవారిలో ఏ ఒక్కరికీ సాటి స్త్రీపై సానుభూతి గానీ, తామంతా కలిసి చేసిన – చేస్తూన్న ఈ అన్యాయానికి పశ్చాత్తాపంగానీ కలగడంలేదా ?

ఈ సంఘటన జరిగిన అనంతరం తన స్థితి దాసిగతికి దిగజారినదని గ్రహించిన లక్ష్మి కృంగిపోయింది.

వారం రోజుల అనంతరం పూల రంగడిలా తిరిగివచ్చిన పార్థసారధి తల్లికి పట్టుచీర, మిగిలినవారికి నైలెక్స్ చీరలు, పిల్లలకు ఆటవస్తువులు తీసుకొచ్చాడు. భార్యముఖాన ఏమీ లేకపోగా, మర్నాడే ఎముకలు విరిగేలా తన్నులూ దెబ్బలూ లభించాయి మరో నగ యివ్వనందుకు. ఇంట అధికారాలకూ, సాధింపులకూ పెద్దలమనుకొనేవారెవరూ కలగజేసుకోలేదు, అది తమ జన్మహక్కు అన్నట్లుగా – క్రొత్తకోడలి ఖర్మ మన్నట్లుగా.

## 3

"నువ్వేమైనా ఉత్తరంగానీ వ్రాశావా? ఉత్తరం, పత్తరం లేకుండా హఠాత్తుగా వూడిపడ్డాడు మీ నాన్న ?"

వంటచేస్తూన్న లక్ష్మివద్దకు వచ్చి అధికారంగా సతాయించింది అత్త.

"నాకు తెలియదు."

"నంగనాచిలా నటించకు.... విను – దీపావళికి తీసుకెళ్తానంటున్నాడు మీ నాన్న. వెళ్తావా ?"

తనయింట బొడ్డూడని సన్యాసిని కూడ 'అండి' 'గారు' అని మన్నించాలి. చెట్టంత వియ్యంకుని విషయంలోమాత్రం

మర్యాద అనవసరమనుకుంటూన్న అత్త అల్పబుద్ధిని లోలోపలే నిరసించుతూ సమాధానమీయలేదు లక్ష్మి.

తండ్రిని చూడటానికి, చేతిలో పని ఆపి వెళ్ళబోతూన్న ఆమెను పెద్దాడబిడ్డ అదలించింది.

"వెళ్దూగానిలే. ఆయన ఎక్కడికీ పారిపోడు ఇప్పుడేగా వచ్చాడు? ఈ పని కానిచ్చి వెళ్ళు".

కొంతసేపటికి వెంకట్రావే లోపలికి వచ్చాడు.

"ఇదిగో మీ అమ్మాయి, ఎవ్వరూ తినేయలేదు." ఎకసక్కెమో నిరసనో తెలియకుండా మాట్లాడింది వియ్యపురాలు. అంతలో పకపకా నవ్వేస్తూ, "అహహ్హహ్హ అన్నయ్యగారూ, నాల్గునెల్లకే బెంగ పెట్టుకున్నారా? అలాంటి 'ఇది' ఏమీ వద్దు మీకు. చూడండి ఎంత చక్కగా కలిసిపోయిందో మాలో! ఎంత వద్దన్నా నా చేతికి అడ్డబడి పనులు చేస్తుంది. అత్తయ్యగారూ, అత్తయ్యగారూ అని వెంట తిరుగుతూనే వుంటుంది." విషం దాచి అమృతం ఒలికించింది. కల్మషం తెలియని వెంకట్రావు నమ్మాడు.

"కాళ్ళు కడుక్కోండి, భోజనం చేద్దురుగాని, ఇంతలో మీ అల్లుడూ రావచ్చు."

"ఎక్కడి కెళ్ళాడు?"

"ఎవరో స్నేహితుడు బొంబాయి నుంచి వస్తేనూ అతడికి ఏదో పార్టీ యిచ్చే ఏర్పాట్లలో తిరుగుతున్నాడు. అతడితో జాయింటుగా ఏదైనా పెద్ద సిటీలో మంచి హోటేలు కట్టే ప్లానులో వున్నాడు. వెధవ ఉద్యోగాలు ఎన్నాళ్ళు చేస్తేనేం లెండి ఎదుగు బొదుగు లు లేకుండా. అందుకే ఇంకా ఉద్యోగానికి వెళ్ళలేదు. సెలవు పొడిగించేడు... .... అయ్యయ్యో, కబుర్లలో పడ్డాను. మీ భోజనానికి ఆలస్యమైపోతోంది."

ఇటువంటి విపరీతపు మర్యాదలతో, అబద్ధపు అంతస్తులతో అవతలి మనిషి వచ్చిన పనినే మరచిపోయేట్లు చేయగల సమర్థులు ఆ యింట అందరూ. అందుకే వెంకట్రావుకు కూతురు చిక్కిపోవడం గానీ, ఆ ముఖంలోని అమావాస్య గానీ కన్పించలేదు.

"లేమ్మా లక్ష్మి లే. ఆ పనులన్నీ వదలిపెట్టు. నువ్వు తయారవ్వు. ఎన్ని పనులు వదలిపెట్టి వచ్చారో ఆయన పాపం! మనపై అంత ప్రేమ గాబట్టి స్వయానా వచ్చారు!" కోడలిపై వగలు ఒలికించేసింది.

"ఇదుగో ఈ క్రొత్తచీర కట్టుకో. ఏదో – మామూలు చీరే. అక్కడ మీ నాన్నగారు కంచిపట్టుచీర యిస్తారులే – పెళ్ళైన మొదటి దీపావళిగా!" పళ్ళన్నీ బయటపెట్టింది.

మరో చిన్న కంఠం తాళం పలికింది. "అన్నయ్యకు వెయ్యిన్నూట పదహార్లిస్తా రనుకుంటాను. ఏమమ్మోయ్ మఱదలా!

బహుమానాలన్నీ నీకే కాదు. మాకూ రావాలి. తెలిసిందా ?"

లక్ష్మి దేనికీ మాట్లాడలేదు. ఈ నరకం నుండి ముందు బయటపడాలి.

"జాగ్రత్త! ఇక్కడి సంగతులన్నీ చెప్పి గొడవలు లేవదీశావంటే నీ కాపు రానికే ముప్పు. మా అబ్బాయి అసలే కోపిష్టి. ఓ పదిరోజులుండి వచ్చేయి" చాలా నిక్కచ్చిగా హెచ్చరించింది అత్త రహస్యంగా ఎవ్వరికీ తెలియకుండా.

"పండగనాటికి పంపించుతాను లెండి అబ్బాయిని. వాడికి ఎన్నో పనులాయె!" అంటూ వెంకట్రావుతో పళ్ళికిలించింది.

"మంచి సూటుబట్టా, పండగ కట్నం సిద్ధంచేసి వుంచండి. వస్తాడు," కూతుళ్లు కోరస్ పాడారు.

పార్థసారధి గుడ్లప్పగించి చూస్తూ మౌనంగా వుండిపోయాడు, అల్లుడి దర్పం ప్రదర్శించుతూ.

## 4

వెంకట్రావు పెద్దతరహా మనిషి. భోళారకం. నవ్వుతూ మాట్లాడేవాళ్ళు చాలా మంచివాళ్ళనుకుని బోర్లబడే రకం.

కానీ ఈ తరపువాళ్ళైన కొడుకులూ, కోడళ్ళూ లక్ష్మి వాలకం చూస్తూనే ఆమె అత్తింట ఏవో లొసుగులు వున్నాయని గ్రహించేశారు.

తల్లీ, పెద్దవదినా తఱచి తఱచి అడగగా మరి నిగ్రహించుకోలేని లక్ష్మి అన్నీ చెప్పేసింది.

"దరిద్రులు. వాళ్ళకీ ఆడపిల్లలున్నారు. నా బిడ్డ వుసురు తగలక పోతుందా?" శోకాలు పెట్టింది శాయమ్మ.

"వాళ్ళెలా ఏడుస్తారో మనకనవసరం. మనం ఏడవకూడదు!"

ధైర్యం కోల్పోకుండా స్థిరంగా అంటూన్న కమలదెస అందరూ చూచారు.

"పార్థసారధి పెద్ద ఉద్యోగస్థుడనీ–ఆ వూరూ ఆఫీసూ అన్ని వివరాలూ కూడా చెప్పాడుగా ఆ పేరిగాడు? వాణ్ణి జుట్టు పట్టి ఈడ్చుకురండి ముందు" భర్తకు ఫర్మాయించింది.

చెల్లెలి కాపురము దుస్థితికి వగస్తూ రాయిలా నిలబడిపోయిన శేఖర్ భార్య మాటలతో కర్తవ్యం గుర్తించి, అక్షరాల ఆమె చెప్పినట్లు చేశాడు.

శేఖర్ గుప్పిటిలోవున్న తన పిలకను విడిపించుకోవటానికి గింజాకుంటూ బహు విధాల ప్రార్థనలు జేస్తూ తన మాట కూడ కొంచం వినమని గోల పెట్టాడు పెండ్లిండ్ల పేరయ్య.

"విడిచిపెట్టు శేఖర్. ఏమిటో ఆ చెప్పేది ఏడవమను." అన్నాడు వెంకట్రావు అసహనంగా.

"బాబ్బాబు రక్షించారు ... దణ్ణాలు పెడ్తున్న పేరయ్య ... కసురు తున్నాడు వెంకట్రావు.

"దొంగనాటకాలు ... గాని అసలు ఏడుపేదో ఏడువు ... లా కొంపలు

SARASWATA NIKETANAM VETAPALEM

మాపే పనులుచేసి ఊళ్ళో బ్రతుకుదామనే వస్త్రా నక్కా ?"

చెళ్ళుమన్న చెంపను తడుముకుంటూ, మరోసారి చేతులు జోడిస్తూ, దీన స్వరంతో అన్నాడు పేరయ్య : "రక్షించండి, నే నే పాపమూ చేయలేదు. నాకు మాత్రం ఏం తెలుసు ? నేనూ ఈ వూరి వాడనే కదా ? ఆ వూరి పేరయ్య చెప్పిన మాటలే నేను మీకు చెప్పాను. మిమ్మల్ని మోసంచేస్తే నాకేం ఒరుగుతుంది బాబూ. మీదుమిక్కిలి చెడ్డపేరు కూడానూ."

మళ్ళీ చెంపలు ప్రేలిపోయాయి పేరయ్యకు.

"అమాయకత్వం నటించకు నంగి వెధవా, నిజం చెప్పు - ఈ పెళ్ళిచేసినందుకు నీకెంత ముట్టింది ?"

మరి లాభం లేదని గ్రహించిన పేరయ్య, శేఖర్‌నుండి తన ప్రాణాలు కాపాడుకోవటానికిగానూ నిజం కక్కేశాడు.

"చెప్తాను బాబూ చెప్తా - ముందు నా మెడ వదలిపెట్టండి."

"ఊం. ఏడువు."

మెడ సవరించుకుంటూ, కంఠంలోనికి దుఃఖం కావాలని తెచ్చుకుంటూ ఒక్కొక్క విషయమే బయటపెట్టాడు పేరయ్య.

"పిల్లాడికి అంత మంచి చదువూ లేక, ప్రవర్తనా లేక.... తెలిసిన మేరకు ఎవ్వళ్ళూ పిల్లనివ్వడంలేదు. అతడి పెత్తండ్రి కొడుకు పేరు కూడా సరిగా అదే. అతగాడు నిజంగానే ఇంజనీరుగా ఉద్యోగం చేస్తున్నాడు. చెప్పింది అతడి గురించి - చేసింది ఇతడికి. నాకు రెండు వేలు అందాయి బాబూ ఈ పని చేసినందుకు. ఏదో పేదవాణ్ణి. కక్కుర్తి పడ్డాను."

"ఛీ" ముఖాన వుమ్మాడు వెంకట్రావు.

"పోనీయ్ శేఖర్ ఆ గాడిదను. మన లాంటివాళ్ళే మన కొంప త్రవ్వితే - ఈ బీదవాడిని కొట్టడం దేనికి ?"


కమల కూడా నిర్ఘాంతపోయింది.

"ఎంత పన్నాగం పన్నారు దుర్మార్గులు ! ఇంటిపేరూ, మనిషి పేరూ ఒక్కటే మూలాన మనం వివరాలు ఆరాలు తీసుకొన్నప్పుడు కూడా పట్టుబడలేదు !"

"ఔను. దురదృష్టంకొద్దీ ఆఫీసులో అతడు లేడు మనం వెళ్ళినప్పుడు. ఆ పేరు గలవాడు ఉద్యోగం చేస్తున్నట్లూ, మంచివాడేననీ తోటి ఉద్యోగులు చెప్పారు."

"ఏమైతేనేం - పెళ్ళిపేరిట పిల్లను గోతిలో దింపాం." కమల వెలిబుచ్చిన అభిప్రాయమే అందరి మనసులలోనూ వున్నది. ఎవరికి వారే నిరసనపడిపోయి దిక్కుతోచనట్లు జేరగిలబడ్డారు గోడలకు.

వాతావరణంలో బిగి, వేడీ తగ్గడం గమనించిన పేరయ్యకు ప్రాణాలు జేరకుని గొంతు లేచింది.




"అయ్యా జరిగిందేదో జరిగిపోయింది. పిల్ల ముఖంరాత ఎవరు తప్పించగలరు? ఇక జరగవలసిందేమిటో చూచుకోండి."

"ఏం కూశావ్‌రా……"

"అయ్యా! నన్ను కొడితే, లాభమేమిటి? ఇంకా మీయింట పెళ్ళికావలసిన ఆడపిల్లలున్నారు. ఎందుకు అనవసరంగా యాగీపడతారు? వెయ్యి అబద్ధాలాడైనా ఓ పెళ్ళిజేసి ఒక యిల్లు నిలబెట్టమన్నారు!"

విడిపోయిన పిలకజుట్టును ఝూడించి ముడివేసుకుంటూ నడచిపోయాడు పేరయ్య.

"వెయ్యి అబద్ధాలతో ఓ పెళ్ళి…" గొణుక్కున్నది కమల. వెక్కి వెక్కి ఏడుస్తున్న లక్ష్మిని చూచి, "ఈ వెయ్యి అబద్ధాలనూ ఒక్క సాహసంతో చెప్పు దెబ్బ కొడదాం."

"పిచ్చిదానా! ఇంకేం చేయగలమే? పడిపోయింది దాని మెడన ఉరి[త్రా]డు. అయినా పూజకొద్దీ పురుషుడని అనవే అన్నారు కదా!" లక్ష్మి తల్లి శోకాలు పెట్టింది.

## 5

"ఇక ఎన్నాళ్ళు అలా పడి ఏడుస్తావే తల్లి? మనసు సరిపెట్టుకు [బ్రత]కాలి, నీకూ ఆ యింటికీ రాసిపెట్టి వున్నది అంతే. లే! లేచి కాస్త మంచి బట్టలు కట్టుకో."

మంచం మీద నిస్త్రాణంగా పడివున్న లక్ష్మిలో మార్పులేదు; చలనంలేదు తల్లి మాటలకు.

"లేమ్మా. తల దువ్వుకొని కాస్త మంచి బట్టలు కట్టుకో. రేపే దీపావళి పండుగ. సాయంత్రానికో రేపటికో మీ ఆయన వస్తాడు కూడ."

లక్ష్మిలో కదలిక లేదు. వెక్కిళ్ళు అధికమయ్యాయి.

"ఆఁ. వస్తున్నాడట పెండ్లికొడుకు గారు. ఇదిగో వార్త!" చేతిలో ఉత్తరంతో ప్రవేశించింది కమల. "స్కూటర్ కొని అల్లుడికి పండగ కట్నంగా యిమ్మని ఘనుడైన అతని తండ్రిగారు వ్రాశారు!"

"ఆఁ!" నీరసంగా నోరావళించే

సింది ముసలామె. "పెట్టిన నగలన్నీ అమ్ముకు తిన్నాడు. పైగా ఇదికూడానా ?"

"అంతేమరి! ఇచ్చేవాళ్ళుంటే వాళ్ళకేం నొప్పి? మీరు వెళ్ళండి! లక్ష్మిని నే లేవదీస్తాను."

"కాస్త చెప్పి చూడమ్మాయ్! నీ మాట వింటుంది." ముక్కుతూ మూలుగుతూ బయటకు నడిచింది.

తలుపు గడియపెట్టి వచ్చి దగ్గర కూర్చున్న వదినను భయం భయంగా చూచింది లక్ష్మి.

"వచ్చేస్తున్నారా? ఆ తిట్లు, దెబ్బలూ.... బాబోయ్!" వదినను కౌగలించుకొని భోరుమన్నది లక్ష్మి "అన్నయ్య నిన్నుగానీ, నాన్న అమ్మను గానీ ఎప్పుడూ కొట్టగా నేను చూడ లేదు. అందుకే మీకు నా బాధ అర్థం కాదు. నన్ను అక్కడికి మళ్ళీ పంప కండి వదినా." వాణికిపోసాగింది.

"నాకు అర్థమైంది లక్ష్మి. నువ్వు ముందా ఏడుపు మాను. నన్ను వదినగా కాదు - సాటి స్త్రీగా చూడు." లక్ష్మి అశగా—బేలగా చూచింది.

"లక్ష్మి, నేను ఈ కాలపు దానను. చదువుకొని ఉద్యోగం చేస్తున్నదాన్ని. పసుపుతాడు ఉరిత్రాడైనా సరే భరిం చాలనే మూర్ఖత్వం నాకు లేదు. నీకు ధైర్యం వుంటే ఈ బాధలు తప్పించు కోవచ్చు."

"చెప్పు వదినా."

"ఏముంది? వదులుకోవడమే! మళ్ళీ చదువుకో. ఈ లోగా విడాకులు కూడా తీసుకోవచ్చు."

గుడ్లు విలబెట్టి విపరీతంగా చూడ సాగింది లక్ష్మి.

"ఈ యింట ఇది సాధ్యమేనా?" అని నీ భయం. సాధ్యమయ్యేట్లు నేను చేస్తాను. 'పతియే ప్రత్యక్ష దైవం', 'పాద దాసిని—అతని కోసం ప్రేమతో పడిచస్తున్నాను' అనే చెత్త కబుర్లేం చెప్పవ్‌గా మరి?"

"లేదు. నన్ను రక్షించు వదినా. ఆ పశువును నేను ద్వేషించని క్షణం లేదు."

శేఖర్, వెంకట్రావు, కామాక్షి తదితర కుటుంబ సభ్యులూ కమల కోరికపై ఆ గదిలో సమావేశ మయ్యారు.

"మామగారూ— చిన్నదాన్ని ఇంటి విషయాలు మాట్లాడుతున్నానని అనుకో వద్దు, లక్ష్మి జీవితానికి మనం ఓ పరిష్కారం ఆలోచించాలి."

అందరూ ముఖ ముఖాలు చూచు కున్నారు.

"చూడండి - భర్త వస్తున్నాడని వార్త వింటూనే ఎలా బెదిరిపోతుందో! ఇందుకా— ఈ ఏడుపు ముఖం చూడ టానికా అంత ఖర్చుపెట్టి అంగరంగ వైభోగంగా పెళ్ళి చేశాం?"

"ఇంతకూ ఏమిటి నువ్వనేది!" అత్త మామలు ఒకేసారి అడిగారు.



"లక్ష్మి— నా ఆడపడుచు. నా సాటి స్త్రీ, నాలాగే సుఖపడాలి. ఏం తప్పు చేసిందని రోజూ తిట్లూ దెబ్బలూ భరించాలి? ఏం నేరం చేసిందని యితరులకు ఊడిగంచేసి వాళ్ళ అదుపాజ్ఞలు భరించాలి? ఇది జరగరాదు".

"దాని ఖర్మ అలా కాలింది........ దేవుడు...."

"కాదు." అత్తగారి మాటలను మధ్యలోనే ఖండించింది ధైర్యంగా కమల.

"ఇంకా చదువుకుంటాను - పెళ్ళి వద్దు" అని పేచీ పెట్టిన లక్ష్మిని 'చక్కటి సంబంధం - అదృష్టవంతురాలవు' అని మభ్యపెట్టీ భయపెట్టీ చదువు మాన్పించి ఈ వివాహం చేతులారా చేసింది మీరు. ఈనాడు ఖర్మా దేవుడూ అనటానికి వీల్లేదు. ఖర్మా దేవుడూ జీవితాలను నిర్ణయించే విషయమే అయితే మనుష్యులు వెదకి వెదకి బేరసారాలు సాగించి పెండ్లిండ్లు చేయడం దేనికి?"

"బాగుంది. అందుకని యిప్పుడేమంటావ్?"

"డబ్బు ఆశ వున్నచోట జీవితాలు

యిలాగే వుంటాయంటాను. అంత డబ్బు ఖర్చుపెట్టవద్దంటే మీ రంతా నన్నప్పుడు పరాయిదాన్ని చూచినట్లు చూచారు."

"ఔనులే...." నసిగింది కామాక్షి.

"అప్పుడు కట్నం, కానుకలూ అయ్యాయి. ఇప్పుడు స్కూటర్, రేపు కారు, మరో ఏడాదికి నాలు గెకరాలు రాసి యిమ్మంటాడు. లేకపోతే పిల్ల అక్కర్లేదంటాడు. అతడిని అదుపాజ్ఞలలో పెట్టగల దిక్కూ దివాణం లేదాయిరి. ఎంతకని మనం యివ్వగలం? ఎంతవరకూ లక్ష్మి ఈ తిట్లూ, దెబ్బలూ, చాకిరీ భరించగలదు?''

"కమల మాటలు ఆలోచించవలసిందే నాన్నా" అన్నాడు శేఖర్.

వెంకట్రావు తల గోక్కున్నాడు.

కామాక్షి మరోసారి ముక్కు చీదింది.

లక్ష్మి అందరి దెసా ఆశగా చూస్తోంది.

"పెండ్లి చేసేవఅకే మనుషుల పెత్తనమూ, ఆ తర్వాత ఖర్మ నిర్ణయమూ అని నేననుకోను మామగారూ. వివాహము స్త్రీకి సుఖాన్నీ భద్రతనూ స్థిరత్వాన్ని ప్రసాదించాలి అవి లోపించి, ఎదురు బాధాకరంగా పరిణమించిన నాడు ఆ బంధాన్ని త్రెంచాలి, ఆ మనిషిని విసర్జించాలి!"

పిడుగుపడ్డట్లుగా చూచారు.

"మతిపోయినట్లు మాట్లాడకు. ఇంటా వంటా లేని అప్రాచ్యపు పని........" కామాక్షి కసురుకున్నది.


"నలుగురూ ముఖాన ఉమ్ముతారు'' అని కూడా అన్నది.

"లేదత్తయ్యా. రోజులు మారాయి. ఆ నలుగురూ నలుసంత సుఖమైనా లక్ష్మికి ప్రసాదించలేరు; న్యాయం చెప్పి ఆమె బ్రతుకును బాగుచేయలేరు. మన లక్ష్మిలాంటి వాళ్ళు ఈ రోజు వీధి కొకళ్ళు వున్నారు. ఖర్మ అనుకొని కృంగిపోకుండా తెలివిగా సాహసించితే తమ జీవితాలను సరిదిద్దుకోగలరు. బాధలు ఎక్కువై ఆత్మహత్యను చేసుకొన్న వాళ్ళను చూస్తున్నాం. లేదా అన్నదమ్ముల ఇండ్లలో పనిమనుషులుగా బ్రతుకు వెళ్ళదీసే వాళ్ళను చూస్తున్నాం. మన లక్ష్మి బ్రతుకు అలా మారకూడదని నా కోరిక. తలిదండ్రులు మీరుండగానే ఆమెకో దారి చూపండి."

గంభీర నిశ్శబ్దం అలముకున్నది కొంతసేపు.

"ఏం చేద్దామంటావమ్మాయ్?" హఠాత్తుగా అడిగాడు కోడలి వాదన సబబుగా తోచిన వెంకట్రావు.

"రేపు వస్తాడు - లక్ష్మి అతడిత మాట్లాడదు. మనం స్కూటర్ యివ్వ సరికదా మర్యాదలు కూడాచేయం. అన్ని



విషయాలు తెగేసి అడిగి ఝాడించుదాం. వాళ్ళుచేసిన మోసం_ పోనీ క్షమించుదాం! కాని లక్ష్మిమీద ఈగ వాలరాదు. మనం యిచ్చిన డబ్బు తన వాళ్ళకోసంకాదు_ లక్ష్మికోసం. ఆ డబ్బుతో లక్ష్మితో సుఖంగా బ్రతుకుతాడా— సరే సరి_ లేకుంటే అతడిని లక్ష్మి మనమూ కూడా మఱచిపోతాం! మన డబ్బు మన కిప్పించటానికి న్యాయస్థానం వున్నది.''

పాతకాలపుదైన కామాక్షి ఉద్రేకంతో ఊగిపోయింది.

"మొగుణ్ణిదిలి ఇంట కూర్చుంటుందా? ఈ బోడి సలహాయా నువ్వు చెప్పేది!"

"ఔను. మొగుడు చచ్చినా పుట్టింటికి జేరాల్సిందే. వాడు బ్రతికుండీ చచ్చినట్లు లెక్క. అంతే తేడా, లక్ష్మిని దక్కించుకోవటానికి యింతకంటే మార్గం లేదు. నలుగురూ నవ్వుతారా _ నవ్వనీయండి వాళ్ళను చూచి మనమూ నవ్వగల కారణాలు అనేకం వుంటాయి."

"అంతవఱకూ సరే. అటువంటి వాడు మారడు, గొడవ వస్తుంది! అప్పుడు ?"

"విడాకులు''

"..............."

"ఔను, వినటానికి బాధగా నే వుంటుంది కానీ అదొక్కటే మార్గం... లక్ష్మిని చదివించుదాం! గొప్ప భవిష్యత్తు వుంటుంది అందువల్ల _ అవి చెప్పలేను కానీ ఎవరి గోలా లేకుండా

తనంతట తను బ్రతుకుతుంది. వెనుక మనం వున్నాం,........ కాల క్రమాన ఎవరైనా సంస్కారవంతుడు లక్ష్మి బ్రతుకులో వెలుగు నింపగలడనే ఆశ తోనే వుందాం. నింపకపోయినా ఫర్వా లేదు. తన ఉద్యోగం తన కుంటుంది, తన డబ్బు తన కుంటుంది - ఎవడి తిట్లూ దెబ్బలూ, గ్రుడ్డి ఆంక్షలూ వుండవు కనీసం.''

"ఏమంటావ్ లక్ష్మి? నీదే తుది నిర్ణయం.'' శేఖర్ చెల్లెల్ని అడిగాడు.

"నేను చదువుకుంటాను. హీనుడికీ, మోసగాడికీ కాపురం చేస్తూ, నిత్యం ఛస్తూ బ్రతకలేను.''

## 6

సూటూ స్కూటరూ అందుకుందామని ఎగిరెగిరిపడుతూ వచ్చిన పార్థ సారధీ, విలువైన చీరసారెలు అందుకొని, విందు భోజనాలు చేసి విజ్జీపీగుదామని వెంటబడి వచ్చిన అతడి తల్లీ అక్కలూ వాడిన ముఖాలతో తిరిగి పోవడం చూచి తేలికగా నిట్టూర్చింది లక్ష్మి.

మిగిలిన పరివారమంతా నిశ్చింతగా నిలబడ్డారు ఏమీ జరగనట్లే.

ఆ సంధ్యవేళ కళకళలాడుతూన్న ముఖంతో దీపాలు వెలిగించుతూన్న లక్ష్మిని చూచి కమల విందుగా సంతోషంగా నవ్వింది.

''మళ్ళా నీ ముఖంలో ఇప్పుడు పూర్వపు జీవకళ వచ్చింది లక్ష్మి."

"ఇదంతా నీ చలవ వదినా. అందరికీ నీ వంటి వదిన వుండాలి."

"కాదు. సాహసం వుండాలి. రోగం వస్తే వెంటనే మందు వేసుకున్నట్టే, సమస్యకు వెంటనే పరిష్కారం తెగేసి ఆలోచించాలి. ఖర్మ, గిర్మ, సంఘం, చట్టుబండలూ అని పిరికిగా కూర్చోకుండా ధైర్యంగా నిర్ణయించుకోవాలి జీవితాన్ని. అప్పుడే మన స్త్రీజాతికి నిజమైన దీపావళి. కేవలం దీపాలు వెలిగించి, పిండివంటలు ఆరగించినంత మాత్రాన నరకాసురుల పీడ వదిలేది కాదు!''

